# హలో మై డియర్ రాంగ్ నంబర్!



ఆఫీసులో అడుగు పెట్టగానే ఫోన్ మోగడం ప్రారంభం అయింది. మా ఆఫీసర్‌గారు నిన్ననే క్యాంపుకి వెళ్లారు కదా..ఎవరైవుంటారు? గబగబా వచ్చి ఫోన్ తీశాను-

'హలో! ఎస్‌పీగారి బంగళాయేనా?'

'అవును...'

'ఎస్‌పీగారికి ఓ సారి ఫోన్ యిస్తారా! నేను మంత్రిగారి సెక్రెట్రీనీ మాట్లాడుతున్నాను...'

'నేనే...ఎస్‌పీనే!'

'నమస్కారం!'

'నేను మంత్రిగారి సెక్రెట్రీని మాట్లాడుతున్నాను! మంత్రిగారు రేపు ఉదయం ఢిల్లీ ఫ్లయిట్‌లో వస్తున్నారు సార్! పోలీసు బందోబస్తు కాస్త ఎక్కువ చెయ్యాలి సార్'

'ఊం...'

'సార్! కొందరు అయ్యగారికి నల్లజండాలు చూపించాలని అనుకుంటున్నారు. వాళ్ళని ఎయిర్‌పోర్టు ఛాయలకు రాకుండా చెయ్యాలి సార్! మరో ముఖ్యమయిన సంగతి - అయ్యగారికి చాలామంది పూలదండలు వెయ్యాలని వస్తున్నారు. వాళ్ళందర్నీ ఎయిర్ క్రాఫ్ట్ వరకు రానివ్వాలి సార్...'

'ఊం...'

'సార్! అయ్‌గారి కారుకిముందు...రెండు మోటారు సైకిళ్లు...పైలెట్ జీపు...వెనకాల రెండు వ్యాన్‌లు వుండాలని చెప్పారండి!'

'అన్నీ బాగానే వున్నాయి కానీ...నేను ఎస్.పి.ని కాదు! ఇది రాంగ్ నంబర్' అంటూ ధాంమ్మని ఫోన్ పెట్టేశాను-.

✡ ✡

ఫోన్ మోగింది. తీశాను...

'హలో...హలో!...' తియ్యని ఆడగొంతు పిలిస్తోంది-

'యస్...'

'యస్...'

'గోపీడియర్...నేను వసంతని!'

'......'

'ఏవిటి డియర్...మరీ అంతకోపం అయితేఎలా? నిన్న సినిమాకి రానన్నానని యింత కోపమా?'

'ఊం...'

'అసలు విషయం అర్థం చేసుకో! నిన్ననాకు పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారు. నేను వుండక పోతే...అమ్మకీ నాన్నకీ కోపం వస్తుంది కదా! పైగా...ఏదయినా అనుమానం వచ్చిందంటే అసలుకే మోసం వస్తుంది!... అయినా, పెళ్ళి చూపులు చూసి...నాకు నచ్చ లేదని చెప్పాను! ఆ పెళ్ళి కొడుకు మా నాన్నకి కూడా నచ్చలేదు!...హలో... వింటున్నావా?...

'ఊం...'

అబ్బ!ఏమిటబ్బా...అన్నింటికీ...ఊంఊం అంటావు! నాకు నిజంగా కోపం వస్తుంది! ఇదిగో...ఇవాళ సాయంత్రం రెడీగా వుండు! సినిమాకి వెళ్దాం! సరేనా...ఇంకా కోపం పోలేదా? ఓ ముద్దు ఇవ్వనా?'

'అమ్మో...వద్దు బాబోయ్! నేను నీ గోపీని కాదు! రాంగ్ నెంబర్‌ని!..పెట్టేస్తున్నా...' అంటూ గభాలున ఫోన్ పెట్టేశాను.

ఆ అమ్మాయి ఎంత తియ్యగా మాట్లాడింది! ఎంత ప్రేమగా మాట్లాడింది! ఒక్కనాడయినా మా ఆవిడ ఇలా మాట్లాడిందా...అనుకుంటూ కుర్చీలోనే కునుకుతీశాను.

అంతలో ఫోన్ మోగింది-

'హలో!'

'హలో ఎవరూ?'

'నేనేనండీ!...పక్కవాళ్ల ఫోన్‌లో నుంచి మాట్లాడు తున్నా! వినపడుతోందా?'

'ఆ ఆ...'

'చూడండి...మీకు యిందాకా రాసియిచ్చిన పచారీ సామాన్ల లిస్టులో కందిపప్పు రాయడం మర్చిపోయాను. నాలుగు కిలోలు కందిపప్పు రాసుకోండి! ఆ చేత్తోనే..అరతులం పాల ఇంగువ...యాభై గ్రాములు మిరియాలు రాసుకోండి! ఈ సారి హార్లిక్స్...చాక్‌లెట్ కలిపింది తీసుకోండి! లేడీ డాక్టర్ నన్ను కూడా...హార్లిక్సే తాగమన్నాది...అందుకని...

'అమ్మా...'

'అమ్మకెందుకండీ హార్లిక్స్? ఆవిడకు నయించదు! తర్వాత...అబ్బబ్బ...మధ్యలో గొణుగుతారేం? మధ్యలో మాట్లాడితే...నేను చెప్పవలసింది కాస్తా మర్చిపోతాను?... నరే...పక్కనెవరూ లేరుగా! ఇవాళ కాస్త త్వరగా రండి!...ఇవాళ...మన పెళ్ళి రోజు...'

'అమ్మా! తల్లీ!...నేను రాంగ్ నెంబర్ రంగ నాథాన్ని!' అంటూఫోన్ పెట్టేశాను!

'అంతలో - మా లేడీటైపిస్టు వచ్చి-

'రాంగ్ నెంబర్ అని ముందే చెప్పవచ్చుగా'

'రాంగ్ నెంబర్ మజా మీకు తెలియదు. ఓసారి యిస్తాను. మాట్లాడండి' అన్నాను.

'మీ పద్ధతేం బాగులేదు...' అంది.

'ఏమయిందీ...?' అన్నాను.

'ఛీ! నాకా పాడు బుద్ధి లేదు!' అంది.

'పాడుబుద్ధి కాదు! ఆ వయసులేదు అని చెప్పండి.' అని లోలోపలే అనుకున్నాను. రాంగ్ నెంబర్ శ్రీమతిగారి ఫోను తల్చు కుంటూ కాస్సేపు... ఆనందంలో ఓలలాడేను...

✿ ✿

రోజూ వచ్చే రాంగ్ నెంబర్లు రాకపోయే సరికి మనసు విలవిల లాడిపోయింది. బొత్తిగా పని చెయ్యాలని అనిపించలేదు.

మధ్యాహ్నం...లంచ్ వేళ...టిఫిన్ బాక్స్ తీసి...టిఫిన్ తినబోతున్నా - గణగణా మ్రోగింది ఫోను-'హలో...నేనే! అన్నాను.

'నీకు బుద్ధి వుందా? నువ్వు అన్నంతింటు న్నావా? గడ్డి తింటున్నావా?"

'రెండూ కాదు! టిఫిన్ తినబోతున్నాను!'

'ఛీ...నోర్ముయ్! మాట్లాడకు! మాటమీద నిలకడలేని వాడివి...నువ్వేంమనిషివి?...'

గొంతు చూస్తే...మా మామగారిదే! కానీ...మా మామగారు నన్ను చాలా గౌరవంగా చూస్తారు. ఇవాళ...

'అయ్యా...మీరు...' అనబోయాను.

'నువ్వు నోరెత్తకు! ఫోన్ కాబట్టి బతికి పోయావ్! మనిషికో మాట...గొడ్డుకోదెబ్బ అంటారు...ఇలా ఎందర్ని ముంచుతావ్? అర్ధరాత్రి ఇంటికి వచ్చి...కడుపూ కాళ్లూ పట్టుకొని...బ్రతిమాలుకుంటే అయ్యో కదా అని సహాయం చేశాను! తప్పించుకు తిరుగు తావా? ఇలా ఎందర్ని మోసం చేశావ్? ...మట్లాడవేం? దగుల్బాజీ వెధవా! నోరు పడి పోయిందిరా!'

మామామగారు కాదు...రాంగ్ నెంబర్ అని తెలిసి పోయింది పైగా...పేరు అడిగి మరీ తిడుతున్నాడు... రాంగ్ నెంబర్ కాదేమో...

'హలో...మీరెవరు?...'

'నేనెవరా? ఏరుదాటి తెప్పకాల్చే వెధవా! నేనెవ రా?... నేనెవరా? అప్పుతీసుకొని...తినేసి... నాటకం ఆడుతున్నావా?'

బాబోయ్ - నేనెవరి దగ్గరా అప్పు తీసు కోలేదు. ఇది డెఫినెట్‌గా రాంగ్ నెంబర్-

'పటప్! రాంగ్ నెంబర్...' అని ఫోన్ పెట్టేశాను! చెమట పట్టిన ముఖం తుడుచు కుంటూ తలెత్తి చూశాను - ఎదురుగా మా టైపిస్టు...మోనాలిసాలా నవ్వుతోంది-.

వళ్ళు మండిపోయింది- టిఫిన్ తినకుండా టిఫిన్ బాక్స్ మూసేశాను-

'చాలా హేవీగా వుందా?...టిఫిన్ మానేస్తు న్నారు...' - మళ్ళీ నవ్వింది మా టైపిస్టు-.

బెల్లు కొట్టి...'బోయ్...మంచినీళ్లు తీసుకు రా...' అని అరిచాను-.

'చూడండి! మంచి నీళ్లు టేబిల్ మీదే వున్నా యి...' అంటూ వెళ్ళిపోయింది టైపిస్టు-

వెళ్తూ వెళ్తూ...' హలో...మైడియర్..రాంగ్ నెంబర్...' అంటూ కూనిరాగం తీసింది! ఫూల్! ఇడియెట్...

□

